

బీరప్పస్వామి జాతర గోడపత్రికను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

## బీరప్పస్వామి జాతర గోడపత్రిక ఆవిష్కరణ

జహీరాబాద్, మే 2: బీరప్ప స్వామి జాతరకు సంబంధించిన గోడ పత్రికను మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆవిష్కరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో న్యాల్‌కల్ మండలం రత్నాపూర్‌లో ఈనెల 8 నుంచి 12 వరకు జరిగే బీరప్ప స్వామి జాతరకు సంబంధించి గోడపత్రిక, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, న్యాల్‌కల్, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు రవీందర్, నర్సింహులు, గ్రామ మాజీ సర్పంచ్ రవికుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ ఎంఆర్.ప్రవీణ్‌కుమార్, నాయకులు వెంకట్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన మోతీరాంను సన్మానిస్తున్న జూనియర్ సివిల్ జడ్జీ శ్రీధర్‌మంథని

## కోర్టు సూపరింటెండెంట్‌కు వీడ్కోలు

నారాయణఖేడ్, మే 2: నారాయణఖేడ్ మున్సిఫ్ కోర్టులో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మోతీరాం ఉద్యోగ విరమణ పొందడంతో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జీ శ్రీధర్‌మంథని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన మోతీరాంను జడ్జి శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో మోతీరాం నిబద్ధతను జడ్జి కొనియాడారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మోతిరాంను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భోజిరెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, ప్రధానకార్యదర్శి నర్సింహారావు, న్యాయవాదులు సుధాకర్, మోహీద్‌పటేల్, భువనేశ్వరి పాల్గొన్నారు.

## వేసవి శిక్షణా శిబిరానికి విశేష స్పందన

జిన్నారం, మే 2: జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని చెట్లపోతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తుందని మండల ఇన్‌చార్జి ఎంఈవో కుమారస్వామి తెలిపారు. విద్యార్థులు ఆసక్తి గల క్రీడాంశాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. పీటీల సమక్షంలో విద్యార్థులు క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్‌లో ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. శిక్షణలో పాల్గొంటున్న విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో స్నాక్స్ కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. వేసవి శిక్షణా శిబిరాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపికపై అధికారుల కసరత్తు



లబ్ధిదారుల ఎంపికపై సమీక్షిస్తున్న కమిటీసభ్యులు, అధికారులు


సిర్గాపూర్, మే 2: మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో శుక్రవారం రాజీవ్ యువ వికాస్ పథకంలో లబ్ధిదారుల ఎంపికపై ఎంపీడీవో మల్సూర్‌నాయక్ నేతృత్వంలో కమిటీ సభ్యులు, బ్యాంకు అధికారులు కసరత్తు చేశారు. ఈ సందర్భంగా ఎం పీడీవో మాట్లాడుతూ ఆర్‌వైవీ పథకం కింద 1250 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టుకున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న సెట్‌పత్రాలు సమర్పించని లబ్ధిదారులు ఈనెల 7వ తేదీలోగా ఎంపీపీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో వాసర్, సంజీవన్‌రావుపేట్ టీజీబీ, సిర్గాపూర్ ఎస్‌బీఐ మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన మున్సిపల్ కార్మికులతో కమిషనర్ మధుసూదన్ రెడ్డి

## మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివి

జిన్నారం,మే 2: మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివని, వారు లేనిదే ప్రజారోగ్యం లేదని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మేడే వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులను కమిషనర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పారిశుధ్య కార్మికుల సేవలు లేకపోతే ప్రజారోగ్యం కుంటుపడుతుందన్నారు. ప్రతిరోజూ కార్మికుల స్వచ్ఛత కార్యక్రమాలతో అందరి ఆరోగ్యానికి ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. కార్మికులకు సముచిత గౌరవం ఇవ్వాలని, వారు అందించే సేవలు వెలకట్టలేమన్నారు. అనంతరం కార్మికులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్వో నర్సింహులు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆయా విభాగాల్లో పనిచేసే మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



మల్చేల్మాలో సీసీ పనులను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి

జహీరాబాద్, మే 2: ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ అన్నారు. శుక్రవారం మల్చేల్మాలో ఉపాధి హామీ పథకం కింద ఎమ్మెల్యే కోటాలో మంజూరైన రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేసినందుకు గ్రామ నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, చిన్నారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఆనందం, ఇస్మాయిల్, రాములు,ప్రేమ్‌సింగ్,వహిద్‌అలీ, అమీత్‌కుమార్, గోరెప్ప, శ్రీకాంత్, దత్తురెడ్డి, మోహన్ రాథోడ్, నసీర్ పాల్గొన్నారు.

# అకాల వర్షం..రైతుకు అపార నష్టం



గుమ్మడిదలలో అకాల వర్షానికి నేలపాలైన ధాన్యాన్ని చూపుతున్న రైతు



గుమ్మడిదలలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, మే 2: అకాల వర్షం రైతులకు అపార నష్టా న్ని మిగిల్చింది. గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన అకాలవర్షంతో రైతుల సాగు చేసుకున్న వరిపంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. శుక్రవారం ఉదయం పంటలను పరిశీలించిన రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఈసారి మంచి దిగుబడి వస్తుందనుకున్న రైతులకు అకా ల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. గుమ్మడిదల మం డల కేంద్రంతోపాటు, కానుకుంట, కొత్తపల్లి, నల్లవల్లి, మంభాపూర్, అనంతారం, అన్నారం తదితర గ్రామాల్లో ఈదురుగాలులు, వడగండ్ల వానలకు రైతులు సాగు చేసిన వరి పంటలు పూర్తిగా దెబ్బతిని, ధాన్యం నేలరాలింది. కూరగాయ పంటలకు కూడా నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వ రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

### రైతులకు సర్కారు సాయమందించాలి

అకాల వానలకు నష్టపోయిన రైతాంగానికి సర్కారు తక్షణ సాయమందించాలని బీఆర్ఎస్ నాయకుడు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిన్నారం, గుమ్మడిదల మండలాల వ్యాప్తంగా రాత్రి ఉరుములు, మెరుపులు, వడగండ్లతో అకాల వర్షం కురిసి రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించాయన్నారు. చేతికి వచ్చిన పంటలు కండ్ల ఎదు టే నేలరాలి నష్టపోయాయన్నారు. వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు కలిగిన నష్టానికి విపత్తుగా భావించి సాయమందించాలని కోరారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిన్నపాపని కుమార్‌గౌడ్, ఆకుల ఆంజనేయులు, సూర్యనారాయణ, ఆంజనేయులు యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణయాదవ్, ఆకుల బాబు, వినోద్ ఉన్నారు.

# నీట్ పరీక్షకు పటిష్ట బందోబస్తు

## ఎస్పీ పరితోష్ పంకజ్



బందోబస్తుపై అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ పంకజ్

సంగారెడ్డి, మే 2: మెడిసిన్ చదివేందుకు అర్హత సాధించే పరీక్ష నీట్‌కు జిల్లాలోని పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, ఆయా కేంద్రాల వద్ద 144/163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్లు అమలులో ఉంటాయని ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నీట్ పరీక్ష బందోబస్తుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరీక్షలను అభ్యర్థులు ప్రశాంతంగా రాయాలని, ఎలాంటి వత్తిడులకు లోనుకాకుండా ప్రశాంతంగా రాయాలని కోరారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం అన్ని వసతులు ఏర్పాటు చేసిందని, పోలీసు బందోబస్తు పటిష్టంగా నిర్వహిస్తూ కేంద్రాల దగ్గర 144/163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటాయన్నారు. అత్యవసరాలకు కంట్రోల్ నంబర్ 8712656739 అందుబాటులో ఉంటుందని, అభ్యర్థులు అర్హత కార్డులో పొందుపర్చిన నియమనిబంధనలు తప్పక పాటించి పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఈ పరీక్షలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అనుమతి ఉంటుందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులకు పరీక్షాకేంద్రానికి చేరుకొనే సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తితే పోలీసు కంట్రోల్ నంబర్ 8712656739కు సమాచారం అందించాలని, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తారని ఎస్పీ వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్య గౌడ్, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేశ్, రూరల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుమన్, ఆర్ఐలు రామారావు, డానియెల్ పాల్గొన్నారు.

# చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



వసతి గృహాల్లో చిన్నారుల బాగోగులు తెలుసుకుంటున్న న్యాయమూర్తి సౌజన్య

సంగారెడ్డి, మే 2: ప్రభుత్వ వసతి గృహాల్లోని చిన్నారులపై ప్రత్యేకశ్రద్ధ చూపడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య వసతిగృహాల అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని శిశుగృహ, సఖీ, భరోసా కేంద్రాలను తనిఖీ చేసి పిల్లల ఆరోగ్యం, భోజన వసతి ఏర్పాట్లను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై పిల్లలను అప్రమత్తం చేస్తూ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా చిన్నారులపై అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహిస్తూ వారి ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని కోరారు. వసతిగృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకొని పిల్లల బాగోగులను పరిరక్షించాలన్నారు. నేటి బాలలు రేపటి పౌరులుగా ఎదిగి ఉన్నత చదువుల్లో రాణించి మంచి గుర్తింపు సాధించాలని న్యాయమూర్తి అకాంక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, న్యాయ సహాయం అవసరమైతే న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని న్యాయమూర్తి సూచించారు.

## మట్టి తరలిస్తే చర్యలు

కోహీర్, మే 2: అక్రమంగా మట్టి వ్యాపారం చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బాలశంకర్, ఎస్సై సతీశ్‌వర్మ హెచ్చరించారు. శుక్రవారం కోహీర్ పట్టణంలో వాల్టా చట్టానికి విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు, మట్టిని తవ్వే ఒక హిటాచిని సీజ్ చేశారు. మండలంలో ఎవరైనా అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. ఈ సందర్భంగా యజమాని బషీర్, డ్రైవర్లు రహీమొద్దీన్, వసీఆహ్మద్, పర్వేజ్‌షాపై వాల్టా చట్ట ప్రకారం కేసు నమోదు చేశారు. వారికి రూ.25వేల జరిమానా విధించారు. మరోసారి తప్పు చేస్తే జరిమానా రెట్టింపు అవుతుందని హెచ్చరించారు.

## నేటి నుంచి దుర్గాభవానీ జాతర

కోహీర్, మే2: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో దుర్గాభవానీ జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. శనివారం ఉదయం అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు, ఆదివారం బోనాల ఊరేగింపు, సోమవారం కల్యాణోత్సవం, మంగళవారం పల్లకీసేవ నిర్వహిస్తామని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందజేస్తామన్నారు.



మార్కండేయ ఆలయంలో రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

## భావన రుషి మార్గంలో నడవాలి

జహీరాబాద్, మే 2: భావన రుషి చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని జహీరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్దన్ అన్నారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో భావనరుషి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, హారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు దండు విఠల్, సగ్గం విఠల్, పండాల్ ప్రభు, గడ్డం గోపాల్, వెంకటేశం, రాజేశ్, రామలింగం పాల్గొన్నారు.



ఆదిశంకరాచార్య చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

## ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి

జహీరాబాద్, మే 2: న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక ఆలయంలో శుక్రవారం ఆదిశంకరాచార్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఆదిశంకరాచార్య చిత్రపటానికి పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కృష్ణ, పూజారులు, భక్తులు ఉన్నారు.

## అధికారులు మారినా.. బోర్డులు మారలే..

ఝరాసంగం, మే 2: మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ బదిలీ అయ్యి నెలరోజులు గడుస్తున్నప్పటికీ సమాచార హక్కు చట్టం బోర్డు మాత్రం పాతదాన్నే కొనసాగిస్తున్నారు. బోర్డులో సమాచారాన్ని అందించే అధికారుల పేర్లు లేకపోవడంతో ప్రజలు సమాచారం కోసం ఎవరిని సంప్రదించాలో తెలియక అయోమయంలో ఉన్నారు. కొత్త అధికారుల వివరాలతో బోర్డును నవీకరించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం వదిలి వెంటనే బోర్డులో ప్రస్తుత అధికారుల పేర్లు, మొబైల్ నెంబర్లు మార్చాలని వివిధ గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## లీకవుతున్న డ్రైనేజీపై ఫిర్యాదు

జిన్నారం, మే 2: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డు బీరప్పబస్తీ మూలమలుపు వద్ద ఓ భవనానికి చెందిన డ్రైనేజీ లీకవడంతో కొన్నిరోజులుగా పరిసరాలు దుర్గంధంగా మారి దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన చెందుతూ బస్తీ వాసులు కమిషనర్ మధుసూదన్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. బస్తీలోని డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించి చిన్నారుల ఆరోగ్యాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన కమిషనర్ శానిటేషన్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో బస్తీవాసులు అశోక్, కిష్టయ్య, ఖలీల్, సంధ్యారాణి, రాహుల్, శ్రీలత, ధనమ్మ పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో హెడ్‌కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందిన పోలీసులకు లోగో పెడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

## బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

జహీరాబాద్, మే 2: హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందిన పోలీసులు విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసి అందరి మన్ననలు పొందాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని హద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న మాణిక్, ఝరాసంగంలో సుభాశ్, చిరాగ్‌పల్లిలో బాలకిషన్, జహీరాబాద్ పట్టణంలో రాథోడ్ మోతీరాం హెడ్‌కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా జహీరాబాద్‌లోని డీఎస్పీ కార్యాలయంలో ఉద్యోగోన్నతి పొందిన హెడ్‌కానిస్టేబుళ్లకు సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖలో ఉద్యోగోన్నతి పొందడం చాలా గర్వకారణమని, ఉద్యోగోన్నతి లభించడం విధి నిర్వహణలో బాధ్యతలు మరింత పెంచుతుందన్నారు. ప్రజలు పోలీసులపై ఉంచిన నమ్మకానికి తగ్గట్లుగా పనిచేయడంతోపాటు బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, పట్టణ, రూరల్ ఎస్ఐలు కాశీనాథ్, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.




సమ్మె గోడపత్రికను విడుదల చేసిన ఆర్టీసీ జేఏసీ నాయకులు

## సమ్మె గోడపత్రికను ఆవిష్కరించిన ఆర్టీసీ జేఏసీ

సంగారెడ్డి, మే 2: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పీఆర్సీ అమలు తదితర అంశాలపై ఆర్టీసీ ఉద్యోగులు కొంతకాలంగా ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నా ఆర్టీసీ యాజమాన్యం స్పందించకపోవడంతో సమ్మెకు ఈనెల 7న పిలుపునిచ్చినందున సమ్మె గోడ పత్రికను డిపో ఎదుట జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపో ఎదుట ఆర్టీసీ జేఏసీ డిపో చైర్మన్ ఎండీ ఇక్బాల్‌పాషా ఆధ్వర్యంలో పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో పీకే మూర్తి, రాఘవరెడ్డి, గురురాజ్, విక్రమ్, భూపాల్‌రెడ్డి, ఎండీ అత్తర అలీ, తులసీ, అనిల్‌కుమార్, అంజయ్య, దాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన పదో తరగతి విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి

## విద్యార్థులకు అభినందన

జిన్నారం, మే 2: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ విద్యార్థులను మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి అభినందించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థినులు అత్యుత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని ఘనంగా సన్మానించారు. మంచి మార్కులు సాధించడం మున్సిపాలిటీకే గర్వకారణం అన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సుకృత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ఎల్లయ్య మృతదేహం

హత్నూర, మే 2: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన హత్నూర మండలం దౌల్తాబాద్‌లో చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హత్నూర మండలం గుండ్లమాచునూర్‌కు చెందిన జక్కుల ఎల్లయ్య(65) గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకువెళ్లి రాత్రి అయినా ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం దౌల్తాబాద్ గ్రామ శివారులో ఎల్లయ్య మృతి చెందినట్లు కుటుంబీకులకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో అక్కడకువెళ్లి విలపించారు. మృతుడికి కుమారుడు, నలుగురు కూతుళ్లు ఉండగా, అందరికీ పెండ్లిండ్లు అయ్యాయి. ఎల్లయ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



క్షుద్రపూజలపై వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్తయ్య గౌడ్

## క్షుద్ర పూజలను ప్రజలు నమ్మొద్దు

సదాశివపేట, మే 2: క్షుద్ర పూజలను ప్రజలు నమ్మొద్దని, వదంతులు పుట్టిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సత్తయ్య గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో క్షుద్రపూజల విషయంపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గత నెల 29న శాంతి పూజలు చేస్తే మానసిక, ఆర్థిక ఇబ్బందులు తొలిగిపోతాయని ఒక పూజారి లక్ష్మికి చెప్పగా పూజలు నిర్వహించారన్నారు. ఈ పూజలను స్థానిక వ్యాపారి ధర్మేందర్ మరోవ్యక్తి బక్కని ప్రభుకు తెలియజేశారన్నారు. పూజను 29న రాత్రి ఎనిమిది గంటల సమయంలో నిర్వహించాల్సి ఉండగా కొన్ని వస్తువులు అందుబాటులో లేనందున ఆలస్యంగా 10గంటల అనంతరం ప్రారంభించారన్నారు. పూజలో ప్రభుతోపాటు తన కూతురు పాల్గొని నిర్వహిస్తుండగా ఇతరులు రహస్యంగా కొన్ని ఫొటోలు తీసి బయట ప్రచారం చేశారన్నారు. పోలీసులకు సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి పూజల విషయాన్ని ఇన్‌స్పెక్టర్‌కు వివరించారని చెప్పారు. క్షుద్ర పూజలు, నరబలి అని ప్రత్యేక నాణ్యాలు పలువురికి పంచడంతో ఆర్థిక ఇబ్బందులు తొలిగిపోతాయని పూజారి చెప్పారని స్పష్టం చేశారు. ఇన్‌స్పెక్టర్ బాలిక తల్లిని విచారించగా పూజకు పంపినట్లు చెప్పారన్నారు. నిజం గడపదాటక ముందే, చెడు అనేది ఊరంతా తిరిగి వస్తుందనే నానుడి నిజం చేసినట్లుగా క్షుద్ర పూజల వ్యవహారం వ్యాపించిందని డీఎస్పీ స్పష్టం చేశారు. పోలీసుల విచారణలో ఎలాంటి అవాంఛనీయ విషయాలు లేవని, కేవలం పుకార్లు మాత్రమేనని, ఇలాంటి వదంతులు ప్రజలు నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్, ఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లైఓవర్‌పై అధికారులతో చర్చిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

## బీహెచ్‌ఈఎల్ ఫ్లైఓవర్ పరిశీలన

రామచంద్రాపురం,మే 2: సంగారెడ్డి జిల్లా బీహెచ్‌ఈఎల్ చౌరస్తా జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను ఎంపీ రఘునందన్‌రావు శుక్రవారం నేషనల్ హైవే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈనెల 5న కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం ఉండడంతో ఎంపీ రఘునందన్‌రావు ఫ్లైఓవర్ పనులు, నాణ్యతను పరిశీలించారు. అనంతరం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై నేషనల్ హైవే అధికారులతో చర్చించారు. అందుకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్‌ని తగ్గించడంతోపాటు రోజువారీ ప్రయాణికులకు మెరుగైన అనుసంధానం లభించిందన్నారు. 5వ తేదీన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఫ్లైఓవర్‌ను ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈర్లరాజు, రాంబాబు గౌడ్, రాకేశ్, రాజేశ్వర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

అందోల్, మే 2 : పాలిసెట్ రాసే విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న జరిగే పాలిసెట్‌కు ఉచిత శిక్షణ అందిస్తునట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ జోగిపేటలో ఉచితంగా ఈనెల 5 నుంచి 12 వరకు శిక్షణ అందిస్తునట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు మే 5న కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారుయ కోచింగ్ సమయం ఉదయం 10 గంటల నుంటి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుందన్నారు. పదో తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల నుంచి డాక్టరేట్ అందుకుంటున్న రమావత్ ప్రకాశ్

## లక్ష్మీసాగర్ వాసి ప్రకాశ్‌కు డాక్టరేట్

పుల్కల్, మే 2: మండలంలోని లక్ష్మీసాగర్‌కు చెందిన రమావత్ ప్రకాశ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించాడు. పాలమూరు యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్ పర్యవేక్షణలో ఎలైట్ మేల్ కోకో ప్లేయర్స్ మోటర్ ఎబిలిటీ, ఫ్లయింగ్ ఎబిలిటీస్‌పై సర్క్యూట్ ట్రైనింగ్ ప్రభావం అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పూర్తి చేసినందుకు ఓయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ రమావత్ ప్రకాశ్ మారుమూల నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించాడు. దివంగత రమావత్ హీర్యానాయక్ రుక్కిబాయిల ఐదోసంతానం రమావత్ ప్రకాశ్, చిన్నప్పటి నుంచి పట్టుదలగా చదివి క్రీడారంగం పరిశోధన గ్రంథాన్ని సమర్పించి డాక్టరేట్ కల సాకారం చేసుకోవడం హర్షించదగ్గ విషయమని గ్రామస్తులు, ప్రొఫెసర్లు సంతోషం వ్యక్తం చేశారు.

## 87వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, మే 2: గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతున్న డంపింగ్‌యార్డును(ఎంఎస్‌డబ్ల్యూ)ను రద్దు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్యారానగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 87వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 87 రోజులుగా పనులు మానేసి డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)కు వ్యతిరేకంగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఏసీ, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నల్లవల్లిలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న రైతు జేఏసీ నాయకులు